క్లుప్తంగా

లేగ దూడల పెంపకంపై శ్రద్ధ వహించాలి



అంపావల్లిలో ప్రదర్శించిన లేగదూడలు

బలిజిపేట: లేగదూడల పెంపకంపై రైతులు శ్రద్ధ వహించాలని మండల పశువైద్యాధికారి గణేష్ తెలిపారు. ఈ మేరకు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంపావల్లిలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో బుధవారం లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. 56మంది రైతులు 58లేగదూడలను ప్రదర్శనకు తీసుకువచ్చారు. కార్యక్రమంలో లేగ దూడలను ఏవిధంగా పెంపకం చేయాలనే దానిపై రైతులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సెంటర్ క్లాస్



సెంటర్ క్లాస్‌లో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులు

పార్వతీపురంటౌన్: జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులకు బుధవారం సెంటర్ క్లాస్ నిర్వహించారు.ఈ కార్యక్రమం ప్రోగ్రాం కన్వీనర్ ఎం.వాసుదేవరావు నాయుడు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి డీటీ గాంధీ పర్యవేక్షణలో జరిగింది. పార్వతీపురం, కొమరాడ మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు హాజరై అనేక అంశాలపై సెంటర్ క్లాస్‌లో చర్చించారు. నర్సిపురం ప్రధానోపాధ్యాయుడు, పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కొనసాగుతున్న జూట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్ష



కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకుడు కొరాడ ఈశ్వరరావు

సాలూరు: మండలంలోని జీగిరాం జూట్ ఫ్యాక్టరీని తెరవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్ష కొనసాగుతోంది. దీక్ష 9 వ రోజైన బుధవారం పలుకార్మిక, ప్రజాసంఘాల నాయకులు కొరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు తదితరులు దీక్షా స్థలికి చేరుకుని సంఘీభావం తెలిపారు. 13 నెలలుగా ఫ్యాక్టరీ మూసివేయడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ వెంటనే ఫ్యాక్టరీ తెరవాలని డిమాండ్ చేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వడిగ్రీ కళాశాలలో బుధవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి, వాటిని ఎలా నివారించాలి తదితర అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఉప తహసీల్దార్ మల్లేశ్వరరావు

గరుగుబిల్లి: రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం సివిల్ సప్లైస్ ఉప తహసీల్దార్ హెచ్.మల్లేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో బుధవారం సమావేశమైన ఆయన ప్రతినెలా 1వ తేదీ నుంచి 17వ తేదీలోగా రేషన్ సరుకుల పంపిణీ చేపట్టాలన్నారు. సెప్టెంబర్ నెలలో బియ్యం, పంచదార, గోధుమపిండి సరఫరా చేయడం జరుగుతుందని, లబ్ధిదారులకు బియ్యం, పంచదారను తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు.

రాఖీల సందడి



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



డీఐఓ డాక్టర్ టి జగన్‌మోహనరావు, డాక్టర్ టి. హేమాక్షి



మీడియా మిత్రులకు రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారీస్

సీతానగరం: అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల బంధం విడదీయరానిదని రుజువు చేశారు మండలంలోని వైద్యాధికారులు డాక్టర్ టి.జగన్‌మోహనరావు, టి హేమాక్షి. మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు, బూర్జ ఆయుష్ వైద్యాధికారి టి.హేమాక్షి అన్నాచెల్లెళ్లు. తాను వివాహం చేసుకుని అత్తవారింట్లో ఉన్నా రక్షాబంధన్ రోజున అన్నయ్య జగన్‌మోహన్ రావు ఇంటికి వచ్చి చిన్ననాటి సంఘటనలు నెమరు వేసుకుని రాఖీ కట్టి దీవెనలు అందుకుంటానని డాక్టర్ హేమాక్షి చెబుతున్నారు.

సాలూరులో రాఖీపౌర్ణమి శోభ

సాలూరు: రాఖీ పౌర్ణమి నేపథ్యంలో బుధవారం సాలూరు పట్టణంలో దుకాణాలు కిటకిటలాడాయి.ముఖ్యంగా వివిధ రకాలైన ఆకర్షితమైన రాఖీలను కొనేందుకు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మున్సిపాలిటి ఆవరణలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీ సిస్టర్స్ రత్న అక్కయ్య, శిల్ప అక్కయ్య తదితరులు స్థానిక మీడియా మిత్రులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

మక్కువలో...

మక్కువ: రాఖీపౌర్ణమి సందర్భంగా సోదరులకు రాఖీలు కట్టేందుకు ఆడపడుచులు, అక్కా, చెల్లెళ్లతో రాఖీ కట్టించుకునేందుకు అన్నాతమ్ముళ్లు రాఖీలు కొనుగోలుచేశారు. ఈ మేరకు మండలకేంద్రం మక్కువలో బుధవారం రాఖీల దుకాణాలు కొనుగోలుదారులుతో కిటకిటలాడాయి.

రాష్ట్రీయ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులు పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సువర్ణముఖినదిపై అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రిడ్జి పనులను ఆర్‌అండ్‌బీ ఏఈ రాజేంద్రతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పని చేస్తోందన్నారు. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.5 కోట్లు విడుదల చేసిందని, పనులు వేగవంతం చేయాలని కోరారు. అనంతరం బుడ్డిపేటలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శంకరాపు వెంకటరమణ తల్లి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న జమ్మాన ప్రసన్నకుమార్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆరవింద్‌కుమార్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పిన్నింటి రామారావు, బూడు రామారావు, గ్రామ పెద్దలు సతీష్, నిడగల్లు మాజీ సర్పంచ్ జి.వెంకటనాయుడు, నర్సంనాయుడు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలకు లోబడి భవనాల నిర్మాణం



జరుగుతున్న బల్క్‌మిల్క్ కేంద్రం శ్లాబ్ పనులు

సీతానగరం: మండలంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు నాణ్యతా ప్రమాణాలకు లోబడి జరుగుతున్నాయని ఇంజనీరింగ్ సహాయకుడు తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు బుధవారం కృష్ణారాయపురంలో పాలసేకరణ, నిల్వ ఉండేవిధంగా మిల్క్ బల్క్ కేంద్రం భవననిర్మాణం శ్లాబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల వ్యవసాయ ఉత్పత్తులను గ్రామాల్లోనే భద్ర పరుచుకునేందుకు వసతులు కల్పిస్తోందని చెప్పారు. రైతులు పండించిన పంటలను మార్కెట్ ధర పలికేంతవరకూ నిల్వ ఉండేలా గోదాంల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ఈ మేరకు పాడిరైతులు విక్రయించే పాలు ట్యాంకర్ వచ్చేంత వరకూ నిల్వ ఉండేలా బల్క్ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ జి.అన్నంనాయుడు పర్యవేక్షణలో తాజాగా శ్లాబ్ పనులు పూర్తి చేసినట్లు తెలియజేశారు.

మణిపూర్‌లో హత్యాకాండకు నిరసనగా బైక్‌ర్యాలీ



ట్రైబల్ పాస్టర్ ఫెలోషిప్ బైక్ ర్యాలీ

సాలూరు: మణిపూర్‌లో మహిళలపై జరిగిన హత్యాకాండను ఖండిస్తున్నామని మండల ట్రైబల్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధి పాస్టర్ సువార్తరావు అన్నారు. ఈ మేరకు మణిపూర్‌లో మహిళలపై జరిగిన హత్యాకాండకు నిరసనగా ట్రైబల్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కురుకూటి నుంచి మామిడిపల్లి వరకు బైక్ ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయచన మాట్లాడుతూ, భారతదేశంలో అన్ని మతాల వారు అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉంటున్నారన్నారు. లేనిపోని అపోహలు సృష్టించి కొన్ని అసాంఘిక శక్తులు దేశంలో అలకల్లోలం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. వీటిపై ప్రభుత్వాలు స్పందించి తగు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

● జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్



పొలంబడి కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

గరుగుబిల్లి: సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని సంతోషపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. సేంద్రియ పద్ధతిలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చన్నారు. గుమ్మలక్ష్మీపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నిర్మల జ్యోతి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని కోరారు. జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎకరానికి 4 నుంచి 5 లింగాకర్షణ బుట్టలు, పసుపురంగు ప్లేట్లు, దీపపు ఎరలను ఏర్పాటు చేస్తే పంటలను ఆశించే పురుగులను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో డీపీఎం షన్ముఖరాజు, వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి, టెక్నికల్ ఏవో హర్షలత, జట్టు ఎఫ్‌పీఓ ఎన్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన కాలువగండి పూడ్చివేత

భామిని: మండలంలోని బాలేరు రోడ్డులో ఏర్పడిన కాలువ గండిని యుద్ధప్రాతిపదికన బుధవారం పూడ్చివేశారు. జీసీసీ డిపో దాటిన తర్వాత చర్చి ముందు రోడ్డుపై ఏర్పడిన గండి కారణంగా అటువైపుగా ప్రయాణించేందుకు ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు. గ్రామ చెరువుకు రోడ్డు కింది భాగం ద్వారా వెళ్లే ఈ కాలువ పైకప్పు కూలిపోవడంతో గండి ఏర్పడిందని, మరో కాంక్రీట్ ప్లేటు వేయించి, గండి పూడ్చివేసినట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. సర్పంచ్ జామి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి.

వాహనాల వేలం



వాహనాలను వేలం వేస్తున్న సెబ్ సిబ్బంది

కురుపాం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బుధవారం వాహనాల వేలంపాట నిర్వహించినట్లు సెబ్ ఎస్ఐ బి.వి.ఎస్.ఎన్.భూషణరావు తెలిపారు. వివిధ ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను వేలం వేయగా, పాటదారులు వాటిని దక్కించుకున్నారన్నారు.

మూడో విడత కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఐటీఐ సిబ్బంది

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో మిగులు సీట్ల భర్తీకి మూడో విడత కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించారు. మొత్తం 182 మంది దరఖాస్తు చేసుకోగా, 135 మంది హాజరయ్యారని, అయితే 28 మందికి మాత్రమే సీట్లు కేటాయించినట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ తెలిపారు.

రూ.2.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



పైడి వీధిలో నిరిస్తున్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ కళావతి

సీతంపేట: స్థానిక పైడి వీధిలో రూ.2.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం బుధవారం చేపట్టారు. సర్పంచ్ ఎ.కళావతి, గ్రామ కార్యదర్శి సుదర్శనరావు ఈ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు ప్రజానిధుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

కురుపాం: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలంతా ఏకమై, తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గుమ్మిడిగూడ, దండుసూర, షేక్‌పా డు తెన్నుఖర్జ, గొటివాడ, నేరేడువలస, దురుబిలి గిరిజన గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్న ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోదీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. ట్రూ అప్ చార్జీ పేరిట విద్యుత్ చార్జీలు ప్రతినెలా పెంచుతోందని విమర్శించారు.
ఇంధన ధరలు కూడా విపరీతంగా పెంచుతోందన్నారు. 2014లో అధికారంలోకి రాకముందు మోదీ తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారని, అధికారం చేపట్టిన తర్వాత ఆ మాటను విస్మరించారని దుయ్యబట్టారు. అంతేకాకుండా ఆయన 50 వేల మంది ఉద్యోగులను తొలగించారన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా ఈ నెల 31వ తేదీన కూడా సంతకాల సేకరణ చేసి, సెప్టెంబర్ 1వ తేదీన సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేస్తామని, నాలుగో తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలను కోరారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు



పీహెచ్‌సీ ఓపీ రికార్డును పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

సీతానగరం: మండలంలోని ప్రజల ఆరోగ్యం పట్ల వైద్య అధికారులు, సిబ్బంది అంకిత భావంతో సేవలందించాలని డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష ఆధ్వర్యంలో సీతానగరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ, ఐపీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన ప్రజలు మంచి వైద్య సేవల కోసం ప్రభుత్వాస్పత్రులకు వస్తున్నారని వారికి అంకిత భావంతో వైద్య సేవలందించి ప్రభుత్వానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆస్పత్రికి ఎటువంటి వ్యాధులతో వస్తున్నారు? చేయాల్సిన వైద్య పరీక్షలు, వైద్య సహాయం, అందజేయాల్సిన మందులపై ఆరాతీశారు. అలాగే పీహెచ్‌సీలో అందుతున్న వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని రెండు పీహెచ్‌సీల పరిధిలో ఉన్న గ్రామీణ వైద్య కేంద్రాల ఎంఎల్‌హెచ్‌పీలతో గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, రోజువారీ ఎంత మంది రోగులకు సేవలందిస్తున్నారు, మందుల నిల్వలు ఎలాఉన్నాయో తెలుసుకున్నారు. ఈ మేరకు ఎంఎల్‌హెచ్‌పీల నుద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో రోగులకు అందుబాటులో ఉండాలని ప్రథమ చికిత్స చేసిన అనంతరం రోగనిర్ధారణ కాకపోతే పీహెచ్‌సీలకు రిఫర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సింహాచలం, జయాగౌడ్, వైద్య సిబ్బంది, ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మసిస్ట్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ వెంకటరమణ

బలిజిపేట: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని వంతరాం పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు వంతరాం ఉన్నత పాఠశాలలో వంతరాం, నారన్నాయుడువలస పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో ఉండే సగం మంది ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు రాయడం, చదవడం నేర్పించడం వల్ల వారిలో చదువుపై ఉత్సాహం పెరుగుతుందని తెలిపారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన అంశాలను స్కూల్ కాంప్లెక్స్‌లో చర్చించుకోవడం ఎంతో అవసరమన్నారు. అందరం నైతిక విలువలతో పనిచేస్తే ఉపాధ్యాయుడిగా మంచి గుర్తింపు వస్తుందని, ఒక విద్యార్థిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దితే ఎంతో సంతృప్తి కలుగుతుందని చెబుతూ డిజిటల్ పాఠాల ప్రాధాన్యతపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. బోధనలో ఉండే వివిధ సమస్యలపై ఉపాధ్యాయులు చర్చించారు.

ఉద్యాన పంటల రైతులు ఈ క్రాప్ చేయించాలి



మాట్లాడుతున్న మండల ఉద్యాన అధికారి ప్రత్యూష

సీతానగరం: మండలంలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందితో తమ పంటలకు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి ప్రత్యూష సూచించారు. ఈ మేరకు బుధవారం ఆమె కాశీపేట,పణుకుపేట, చినభోగిలి, తామరఖండి గ్రామాల్లో పామాయిల్, అరటి, కొబ్బరి, బొప్పాయి, మామిడి, జీడి తోటలకు చేస్తున్న ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధిక పెట్టుబడులు పెట్టిన తరువాత నష్టం వాటిల్లితే ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తుందని, పొలంలో పండించిన పంటను ప్రభుత్వం లేదా యాజమాన్యం విధిగా కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ క్రాప్ వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని, ప్రభుత్వం నుంచి రాయితీలు పొందవచ్చని తెలియ జేశారు. ప్రభుత్వం ఉద్యానవన పంటలు సాగుచేస్తున్న రైతులకు ఇస్తున్న ప్రోత్సాహంతో సాగువిస్తీర్ణం గణనీయంగా పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు జగదీశ్వరరావు పాల్గొన్నారు.

'ప్రత్యేక' పిల్లలకు అభినందనలు



ప్రత్యేకవసరాలు గల పిల్లలను అభినందిస్తున్న హెచ్‌ఎం హేమలత

మక్కువ: పార్వతీపురం మన్యం జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఆటలపోటీల్లో మక్కువ మండలానికి చెందిన 10మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు పలు క్రీడల్లో రాణించారు. ఈ మేరకు స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం హేమలత ఆ పిల్లలను అభినందించారు. మక్కువ జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన ఐదుగురు, వెంకటభైరిపురం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఐదుగురు ప్రత్యేకవసరాలగల పిల్లలు జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందని హెచ్‌ఎం హేమలత సంతోషం వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఐఈడీఎస్ఎస్‌లు ఆర్.శంకర్రావు, ఆర్.చిన్నయ్య, ఐఈఆర్‌పీ శైలజ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి:

నిరుపేదలకు కేటాయించిన ఇళ్లస్థలాల ను ఇంద్రాని క్లస్టర్ రైస్‌మిల్లు అసోసియేషన్ ప్రైవేట్ లిమిటెడ్, కామన్ ఫెసిలిటీ నిర్మాణానికి ఇవ్వవద్దని నాగూరు గ్రామ సర్పంచ్ కేతిరెడ్డి శిరీష కోరారు. ఇదే విషయమై ఆమె మండల తహసీల్దార్ జి.వి.జనార్దన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ సమీపంలోని పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఐదెకరాల స్థలంలో ఎంఎస్ఈపీడీపీ పథకం కింద కామన్ ఫెసిలిటీ నిర్మాణానికి పంచాయతీ తీర్మానం ఇవ్వాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తెలియజేశారన్నారు. సర్వే నంబర్ 102-1లో ఉన్న భూమి నిరుపేదల ఇంటి స్థలాలకు, ప్రభుత్వ భవన నిర్మాణాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇదే స్థలంలో గ్రామంలోని 40 రజక కుటుంబాలకు సంబంధించి, దోబీ ఖానాల నిర్మాణానికి కూడా కొంత స్థలం కేటాయించేందుకు పంచాయతీ తీర్మానం చేయడం జరిగిందని స్పష్టం చేశారు. అందరికీ ఉపయోగకరమైన స్థలంలో కామన్ ఫెసిలిటీ నిర్మాణానికి స్థలం కేటాయించవద్దన్నారు. ఆమె వెంట నాయకులు కె.అచ్యుతరావు తదితరులు ఉన్నారు.